


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 89 ఆదివారం 30-03-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## నాగర్‌కర్నూల్ ర్యాగింగ్ కలకలం

నాగర్‌కర్నూల్, మార్చి29:



ర్యాగింగ్‌పై ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కొన్నిచోట్ల ర్యాగింగ్‌లకు పాల్పడుతూనే ఉన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఈ నెల 25న రాజస్థాన్‌కు చెందిన మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. అతని సెల్‌ఫోన్ తీసుకుని వీడియోలు సెండ్ చేసుకున్నారని అనంతరం తనపై దాడి చేశారని పోలీస్ స్టేషన్‌లో బాధిత విద్యార్థి ఫిర్యాదు చేశారు. ఈ ర్యాగింగ్ ఘటనపై కాలేజీ వైస్ ప్రిన్స్‌పాల్ సుగుణ స్పందించారు. ర్యాగింగ్ జరిగింది వాస్తవమేనని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. వచ్చేనెల 2న వారితో సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించామని, మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ప్రిన్స్‌పాల్ సుగుణ తెలిపారు. తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లా, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మూడు రోజుల క్రితం రాత్రి సమయంలో ఫస్టియర్ ఇయర్ విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. అతనిపై వికృత చేష్టలకు పాల్పడ్డారు. దీనిపై బాధిత విద్యార్థి కాలేజీ ప్రిన్స్‌పాల్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మెడికల్ కాలేజీల్లో చాలా వరకు జరుగుతున్నాయి. అయితే బయటకు రావడంలేదు.

# పదేళ్లు కొడంగల్‌కే సీఎం సీటు

**దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా**
**భూములు కోల్పోయిన కుటుంబాలకు 2 ఉద్యోగాలు**
**అంబేద్కర్‌ను అవమానించిన షా**
**బీసీలకు బీజేపీ వ్యతిరేకం**
**హిందూ ముస్లింలు ఏకమై దేశాన్ని కాపాడాలి: సీఎం రేవంత్**
**కొడంగల్‌లో ముఖ్యమంత్రి పర్యటన**





**తొలి సమయం,వికారాబాద్,మార్చి 29:** రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీ.. పదేళ్లపాటు కొడంగల్‌కే ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లలో కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదుద్దుతానన్నారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన వారి కుటుంబాలకు ఎకరాకు రూ.20 లక్షలు, 150 గజాల ఇంటిస్థలంతోపాటు కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వచ్చే ఐదేళ్లలో మరో రూ.10 వేల కోట్ల పనులు చేపడతామని చెప్పారు. శనివారం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం పర్యటించారు. సాయంత్రం కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ముస్లింలకు సీఎం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి కొడంగల్‌లోని తన నివాసంలో నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశంలో రేవంత్ మాట్లాడారు. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంటు సాక్షిగా బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా, మహాత్మాగాంధీని చంపిన వారిని ప్రోత్సహించేలా మాట్లాడడం దారుణమన్నారు. వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సమావేశాలు నిర్వహించి ఆయన స్ఫూర్తి చాటాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. కొడంగల్ ప్రాంత ప్రజలు ఇచ్చిన శక్తితోనే తాను ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీకి వస్తే కొడంగల్ వ్యక్తిగా తాను మాట్లాడితే మాట పడాల్సి వస్తుందనే మాజీ సీఎం కేసీఆర్ సభకు రావడం లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తరఫున అసెంబ్లీకి వచ్చిన వారికి ఓనమాలు కూడా రావని అన్నారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు ఉండాల్సిన అధికారం కొడంగల్‌కు రావడంతో కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. కొడంగల్‌ను ఎలాగైనా దెబ్బతీయాలనే లక్ష్యంతో రైతులను రెచ్చగొట్టి పరిశ్రమలను అడ్డుకునేందుకు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం హెూదాలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి తెలంగాణను కాపాడుకునే బాధ్యతను తాను తీసుకుంటానని, కొడంగల్ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని అన్నారు. తనను లగచర్లకు వెళ్లాలంటూ అసెంబ్లీలో కేటీఆర్ విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, త్వరలోనే లగచర్లలో సమావేశం నిర్వహించి రైతులతో మాట్లాడతానన్నారు. కొడంగల్ ప్రాంతంలో ఎకరా భూమి ధర కోటి రూపాయల వరకు పెరగడమే తన ఆకాంక్ష అని ప్రకటించారు "నేను ఉన్నంతవరకు కొడంగల్‌లో అభివృద్ధి పనుల కోసం మీరు ఎవరి వద్దకో వెళ్లి బిక్షం అడగాల్సిన పనిలేదు. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి. పనుల కోసం మీరు హైదరాబాద్‌కు రావాల్సిన పని లేదు. చిట్టీ రాసి పంపిస్తే 24 గంటల్లో నేనే వచ్చి కొడంగల్‌కు ఏ పనులు కావాలో అవన్నీ పూర్తి చేయిస్తాను" ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన సందర్భంగా వారినుద్దేశించి సీఎం మాట్లాడారు. గత 15 ఏళ్లుగా మంచికి, చెడుకు ఇక్కడి ముస్లింలు తనకు అండగా ఉన్నారని తెలిపారు.

## ఉచిత పథకాలతో రాష్ట్రాలు దివాలా

**జీతాలుఇవ్వడానికే కష్టంగా మారిన పరిస్థితి**
**ఓట్ల కోసం ఫ్రీ పథకాలు సరైనవి కావు**
**విజయవాడ సదస్సులో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



**విజయవాడ,మార్చి29:** ఫ్రీ పథకాలతో ఉద్యోగులకు జీతాలుకూడా చెల్లించలేని దుస్థితికి తెలుగు రాష్ట్రాలు వచ్చాయని, అప్పులు తీర్చే మార్గాలు చూపకపోతే కొత్తగా అప్పులు ఇవ్వని పరిస్థితి రావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. అన్నీ ఫ్రీ.. ఫ్రీ.. అంటూ ఓట్ల కోసం జనాన్ని ఆకట్టుకుంటున్నారు. జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితికి తెలుగు రాష్ట్రాలను తెచ్చారు. అప్పులు అనేవి ఫ్రీగా రావనే వాస్తవాన్ని పాలకులు గుర్తించాలని చురకలు అంటించారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి మరీ అప్పులు తీసుకొస్తున్నారు. పరిధికి మించి అప్పులు చేస్తే.. అప్పులు కూడా పుట్టని స్థితికి వస్తారని గుర్తుంచుకోవాలని ఘాటుగా హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి అప్పులు చేసే విధానం రావాలి. ఏపీ, తెలంగాణ నేతలు పరిస్థితులు గమనించాలి. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులపై పాలకులు దృష్టి పెట్టాలి. భావితరాల గురించి ఆలోచించాలి.

# సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం

**- దేశంలో తెలంగాణలో మాత్రమే పంపిణీ**
**- సన్నబియ్యంతో అదనంగా 2800 కోట్ల భారం**
**- నేడు సిఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం**
**- పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



**తొలి సమయం సూర్యాపేట,మార్చి29:** సన్నబియ్యం పంపిణీ రాష్ట్ర చరిత్రలో నిలిచి పోయే కార్యక్రమమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది రోజున ఇది ప్రారంభం కానుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఉగాది రోజు ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మొత్తం కేబినెట్, ఎంపీలు హాజరు కాబోతున్నారని తెలిపారు. ప్రతి కార్యకర్త కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాలని చెప్పారు. శనివారం మెల్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి, మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెల్లరేషన్ కార్డ్ దారులకు మూడు రంగుల కార్డ్... ఉన్నతులకు గ్రీన్ కార్డ్ అందజేసే ఒదుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. రాష్ట్రంలో 84శాతం జనాభాకు మేలు చేసే కార్యక్రమం చేపట్టబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉగాది రోజున ఆదివారం హుజూర్‌నగర్ వేదికగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి అర్హులందరికీ రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 30 లక్షల మందిని రేషన్‌కు అర్హులుగా గుర్తించబోతున్నట్లు వెల్లడించారు. పేదలకు త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు వంటి సరకుల్ని కూడా రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తామని చెప్పారు. దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ వల్ల రాష్ట్రంపై రూ.2,800 కోట్ల అదనపు భారం పడనుంది. ఆ భారాన్ని భరించాలని కేంద్రాన్ని కోరామని అన్నారు. దేశంలోనే పేదలకు సన్నబియ్యం అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే నని అన్నారు. దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించబోతు న్నామని చెప్పారు. ప్రతి లబ్ధిదారుకు 6 కిలోల బియ్యం ఇస్తాం. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని కూడా తెలిపారు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరుంటే కార్డులేకపోయినా రేషన్ తీసుకోవచ్చన్నారు. నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇంత మంచి సంక్షేమ పథకాన్ని చూడలేదన్నారు. రేషన్‌కార్డుపై ప్రధాని ఫొటో గురించి ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు. కొత్తగా జారీచేసే వాటితో కలిపి రాష్ట్రంలో రేషన్‌కార్డుల సంఖ్య కోటికి, లబ్ధిదారులు 3.10 కోట్ల మంది అవుతారని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. సన్న బియ్యాన్ని రాష్ట్ర అవసరాలకే వాడతాం. ఎఫ్‌సీఐకి ఇవ్వం. దొడ్డు బియ్యం మాత్రమే ఇస్తామని మంత్రి వివరించారు.

## మరోసారి మల్లారెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు

**ఓ ఈవెంట్‌లో హీరోయిన్‌పై అసభ్యకర కామెంట్**
**మండిపడుతున్న పలువురు**



**హైదరాబాద్, మార్చి29:** బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎప్పుడు ఏదోఒక సంచలన వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారు. ఈ క్రమంలోనే ఓ సినిమా ఆడియో ఫంక్షన్‌కు వెళ్లిన మల్లారెడ్డి హీరోయిన్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ పేరు కసీ కపూర్ అంట.. ఆమె మాత్రం కసికసిగా ఉందంటూ నోరు పారేసుకున్నారు. మల్లారెడ్డి వ్యాఖ్యలతో ఈవెంట్‌కి వచ్చిన ప్రేక్షకులంతా పగలపడి మరీ నవ్వారు. ఆ సినిమా హీరో సైతం నవ్వేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. మల్లారెడ్డి వ్యాఖ్యలపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. ఆయన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియా వేదికగానూ పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. చట్టసభల్లో ఉండే వ్యక్తులు మహిళల గురించి ఇలా మాట్లాడడం ఏంటని పలువురు మండిపడుతున్నారు. మల్లారెడ్డి నోరు జారడం కొత్తేమీ కాదంటూ కామెంట్లు చేస్తున్నారు. సినిమా ఆడియో ఫంక్షన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే మల్లారెడ్డిని నిర్వాహకులు స్టేజ్ పైకి ఆహ్వానించారు. స్టేజ్ పైకి వెళ్లిన ఆయన మైక్ తీసుకుని మాట్లాడడం ప్రారంభించారు. హీరోయిన్ ప్రస్తావన వచ్చినప్పుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. "హీరోయిన్ పేరు కసీ కపూర్ అంట.. కసికసిగా ఉంది. ఈ సినిమా హీరో మా స్టూడెంట్. మా స్టూడెంట్ హీరో కావడం సంతోషంగా ఉంద న్నారు. అతను ఇక్కడే చదివాడు, ఇక్కడే హీరో అయ్యాడు, ఇక్కడే సినిమా ప్రమోషన్ కూడా జరుగుతుండటం చాలా సంతోషమని పేర్కొన్నారు.

## హిమాచల్ నుంచి విద్యుత్ కొనుగోళ్లు

**సిఎం సుఖ్వీందర్ సమక్షంలో ఎంవోయూ**
**నిరంతరంగా విద్యుత్ లభ్యతే కారణమన్న భట్టి**

**సిమ్లా,మార్చి29:** తెలంగాణలో వేగంగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని అవసరమైన విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది.హిమాచల్‌తో ఒప్పందాన్ని చేసుకుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఛత్తీస్‌ఘడ్‌తో ఒప్పందం చేసుకోగా ఇప్పుడు హిమాచల్‌తో ప్రబుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ– 2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ భద్రతను పెంచుకునే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ఆర్థికంగా మేలైనది, స్వచ్ఛమైన విద్యుత్‌ను పొందేందుకు ఈ ఒప్పందం గొప్ప ముందడుగన్నారు. శనివారం ఆయన హిమాచల్ రాజధాని సిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖుతో సమావేశమైన భట్టి.. విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు జల విద్యుత్ వ్యయం తక్కువగా ఉంటుందని భట్టి అన్నారు. అంతేకాకుండా థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ఏటా పెరుగుతూ ఉండగా.. హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తోంద న్నారు. ఎక్కువ జీవనదులు ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతర హైడల్ పవర్ ఉత్పత్తికి అనువుగా ఉంటుందని అన్నారు. ఇక్కడ విద్యుత్ సరఫరా అధికంగా ఉండడమే ఒప్పందానికి కారణమన్నారు.ఈ ఒప్పందం ద్వారా ప్రజలకు తక్కువ ధరకు, పర్యావరణ హితమైన విద్యుత్‌ను అందించేందుకు అవకాశం ఉంటుంది.



# విశ్వావసు ఉగాదికి స్వాగతం !

యుగం ఆరంభం కనుక ఉగాది అన్న అనర్థంలో కొత్త సంవత్సరానికి ఉగాది అని పిలుచుకోవడం పరిపాటి అయ్యింది. మన తిథి, వార, నక్షత్రాలు, గణాలు అన్నీ కూడా ఉగాదితోనే మొదలవుతాయి. అందుకే తెలుగువారికి ఉగాది చాలా ప్రత్యేకమైన పండగ అని చెప్పవచ్చు. చైత్రశుక్ల పాడ్యమినాడు విశాలవిశ్వాన్ని బ్రహ్మదేవుడు సృష్టించాడు కనుక సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపుకుంటామని అంటారు. ఈ విశ్వావసునామ సవంత్సరం.మొత్తంగా 60 వసంతాలు ఉంటాయి. ప్రభవతో మొదలై 60 ఏళ్ల తర్వాత మళ్లీ ప్రభవ వస్తుంది. ప్రస్తుతం మనం విశ్వావసులోకి ప్రవేశిస్తున్నాం. ఉగాది అంటే యుగారంభం అని పురాణ ప్రవచనం. మనకు కొత్త వత్సరం ఉగాదితోనే ప్రారంభం అవుతుంది. బ్రహ్మదేవుడు ఇదే రోజున విశ్వాన్ని సృష్టించాడని పురాణోక్తి. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడు.. అంటే ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణ ఐతిహ్యం. వేదాలను హరించిన సోమకుని వధించి మత్స్యావ తారి యైన విష్ణువు వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభతరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందన్న పురాణ ప్రచారం కూడా ఉంది. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగిలించి మానవాళిలో నూతనాశయాలను అంకురింప చేసే శుభదినం ఉగాదిని చూడాలి. శిశిర ఋతువు ఆకురాలు కాలం. శిశిరం తరువాత వసంతం వస్తుంది. చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా వుంటుంది. కోయిలలు కుహూకుహూ అని పాడుతాయి.ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదల వుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది అని చెప్పాలి. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించుట పరిపాటి. అయితే ద్వాదశ రాసులు ఎలా ఉన్నా ఉగాది నుంచి అంతా మంచే జరుగాలని కోరుకుంటూ ముందుకు సాగడం ఆనవాయితీగా వస్తోంది.



చైత్ర శుక్ల పాడ్యమి రోజున బ్రహ్మదేవుడు తన సృష్టి ముగించాడనీ, అదే యుగారంభమనీ చెబుతారు. అయితే, ఆ రోజునే సృష్టి ప్రారంభమయిందనీ అందుకే ఆ రోజు యుగాదిగా పరిగణన పొందిందనీ అంటారు. ఉగస్య ఆది అనేదే ఉగాది. ఉగ అనగా నక్షత్ర గమనం.జన్మ ఆయుష్షు అని అర్థాలు. వీటికి 'ఆది' అనగా మొదలు ఉగాది. అనగా ప్రపంచం జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయింది. ఇంకొకవిధంగా చెప్పాలంటే, 'యుగం' అనగా రెండు లేక జంట అని కూడా అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే ఆయన ద్వయ సంయుతం యుగం సంవత్సరం కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయింది. అదే సంవత్సరాది. ఉగాది వసంతాలకు గల అవినాభావ సంబంధం, సూర్యునికి సకల ఋతువులకు ప్రాతః సాయంకాలాది త్రికాలములకు ఉషాదేవత యే మాతృస్వరూపం. ఆ రోజున ప్రాతః కాలమున లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్ర పరచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంక రిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైంది. షడ్రుచుల సమ్మేళనం. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.. విశ్వావసు నామ సంవత్సరం ఆదివారం నాడు వస్తోంది. కాబట్టి రాజు సూర్యుడుగా పరిగణించాలి. సూర్యుడు మేషరాశిలోకి సంక్రమించే వారాన్ని బట్టి మంత్రిని, సింహరాశిలోకి ప్రవేశించే వారం ఆధారంగా సేనాధిపతిని, కర్కాటక సంక్రమణం చేసే వారాన్ని బట్టి సస్యాధిపతిని, ధనూరాశిలోకి వచ్చే వారం ఆధారంగా ధాన్యాధిపతిని, మిథున సంక్రమణ జరిగే వారాధిపతిని అర్ఘాధిపతిగా, తులలో ప్రవేశించే రోజును బట్టి రసాధిపతిని, మకరరాశిలో ప్రవేశించే వారం ఆధారంగా నీరసాధిపతిని.. ఇలా నవ నాయకులను నిర్ణయిస్తారు. సూర్యుడు.. ఆరుద్ర నక్షత్రంలోకి ప్రవేశించే వారం అధిపతి ఆధారంగా మేఘాధిపతిని నిర్ణయిస్తారు. నవనాయకులను బట్టి.. సంవత్సర ఫలితాలను పంచాగకర్తలు అంచనా వేస్తారు. సంవత్సరాది ఏ వారం వస్తుందో.. ఆ వారానికి అధిపతిని రాజుగా నిర్ణయిస్తారు. రాజు, మంత్రి, సేనాధిపతి పరిపాలనను నిర్ణయిస్తారు. సస్యాధిపతిని బట్టి వర్షపాతం, ధాన్యాధిపతిని బట్టి ధాన్యవృద్ధి, అర్ఘాధిపతిని ఆధారంగా నవ్వులు, మినుములు మొదలైన వాటి దిగుబడి, మేఘాధిపతి ఆధారంగా వర్షాలు, పంటలు ధరలు, రసాధిపతిని బట్టి పులుపు, చేదు మొదలైన పదార్థాల ధరల హెచ్చుతగ్గులు నిర్ణయిస్తారు. ఉగాది అంటేనే రానున్నకాలానికి విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. కాలచక్ర పరిభ్రమణం ఆధారంగా నవనాయకుల నిర్ణయం జరుగుతుంది. ఆ విశేషాలను జ్యోతిషశాస్త్రం తెలియ జేస్తుంది. ప్రతి సంవత్సరానికీ రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధిపతి, ధాన్యాధిపతి, అర్ఘ్యాధిపతి, మేఘాధిపతి, రసాధిపతి, నీరసాధిపతి అని తొమ్మిదిమంది నాయకులు ఉంటారు. వీరినే నవనాయకులు అంటారు. ఇక ఇళ్లలో కూడా పంచాంగానికి పూజలు చేయడం కూడా ఆనవాయితీగానే వస్తోంది. చంద్రుడి నక్షత్ర యోగాన్ని అనుసరించి చాంద్రమానం, సూర్య సంక్రమణాల ప్రకారం సౌరమానం, గురూదయాన్ని ఆధారంగా చేసుకొని బార్హస్పత్య మానం లెక్కిస్తారు. ఎవరి పరంపరాగతమైన, ప్రాంతాను సౌర మానాలు వారికి ప్రమాణాలు. ఇందులో వైరుధ్యాలేమీ లేవు. గణనలో విభిన్నత్వం ఉన్నా ఫలాల్లో, పంచాంగాల పద్ధతుల్లో పెద్దగా భేదమేదీ ఉండదు. ఈ పండగ రోజంతా కొత్త వాతావరణం స్ఫురిస్తూ ఉంటుంది. నూతనశోభ సర్వత్రా వెల్లి విరుస్తుంది. ప్రకృతిలోని చెట్టు, పుట్ట అంతా ఆనంద మయంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. అలాంటి శుభవేళ మానవాళి అంతా ప్రకృతి పులకింతకు అనుగుణంగా మధురానుభూతులను పరస్పరం పంచుకోవాలన్న ఓ మహత్తర సమసమాజ స్థాపన లక్ష్యం ఉగాది పండగ వెనుక దాగి ఉంది. శాలివాహన చక్రవర్తి చైత్రశుక్లపాడ్యమి నాడే పట్టాభి షిక్తుడై తన శౌర్యపరాక్రమాలతో శాలివాహన యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరింపబడుతుందని చారిత్రక వృత్తాంతం.

# పవిత్రతకు ప్రతిరూపం రంజాన్

## నియమ బద్ధమైన జీవితానికి నిదర్శనం




**కడప,మార్చి29:** పవిత్రత అన్నది ప్రతి మతంలోనూ ఉంటుంది. ఆచార వ్యవహారాలు కూడా ఓ క్రమపద్ధతిలో మనిషిని నిలబెడుతాయి. ఇందుకు ముస్లింల ఉపావాసలు సాగించే రంజాన్ ప్రతక్ష్య ఉదాహరణ. పవిత్ర రంజాన్ సందర్భంగా నెలరోజులపాటు కఠిన ఉపవాసదీక్ష చేసి ముగించడం ఓ అరుదైన పవిత్ర కార్యక్రమం. ఇది కేవలం ముస్లిం మతంలోనే ఉంది. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజులు ప్రతి ఒక్కరూ దీనిని పవిత్ర కార్యంగా అల్లాహ్ కోసం నియమ నిబంధనలతో పాటించడం బహుశా అరుదైన విశేషమైన ప్రక్రియగా చూడాలి. ఇందులో ఆరోగ్య సూత్రాలూ ఇమిడి ఉన్నాయి. భగవంతుడిపై ప్రేమా ఉంది. కఠిన ఆచారమూ ఉంది. రోజా మనలో ఉన్న మాలిన్యాన్ని కడిగేయడానికి ప్రయత్నిస్తుంది. చెడుకు దూరం చేసి.. సత్ప్రవర్తనవైపు నడిపిస్తుంది. ఖురాన్‌లో రోజా అంటే ఉపవాసం ప్రాధాన్యాన్ని అల్లాహ్ వెల్లడించారు. దీని ప్రకారం ప్రతి ముస్లిం తప్పక ఉపవాసం పాటించాల్సిందే. పేద వారి ఆకలి ఎలా ఉంటుందో తెలియజేయడమే దీని పరమార్థం. గత మాసం రోజులుగా ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు చేసి అత్యంతం నియమనిష్టలను ప్రదర్శించారు. ఆదివారం పాడ్యమి రోజు చంద్రవంక దర్శనంతో సోమవారం రంజాన్ పండుగను జరుపుకుంటారు. ఓ నియమబద్ధమైన జీవితానికి రంజాన్ తార్కారణంగా నిలుస్తుంది. ఇంతటి పవిత్రమైన ఈ మాసం ముగింపు సందర్భంగా ఈదుల్ ఫితర్ జరుపుకోవడం ద్వారా పవిత్ర రంజాన్ మాసం ముగుస్తుంది. ఈ నెలరోజుల కఠిన ఉపవాసంలో అనుసరించి న సన్మార్గాన్ని యేడాదంతా కొనసాగించాలని మహ్మద్ ప్రవక్త ఆదేశం. ఆ మేరకు అతి పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. అల్లాహ్‌తో మన సంబంధాలు మరింత దృఢం చేసుకొనే అవకాశాన్ని రంజాన్ అందించింది. అల్లాహ్‌ను మన్నింపు కోరుకోవడానికీ, మనం ఎలాంటి స్థితిలో ఉన్నామో విశ్లేషించు కోవడానికీ, మన జీవిత లక్ష్యం, మన జీవిత గమ్యం గురించి ఆలోచించడానికీ, దైవాదేశాల ప్రకారం మన జీవితాల్ని చక్కదిద్దుకోవడానికీ అవసరమైన అవకాశాన్ని రంజాన్ మాసం కల్పించింది. ఆ అవకాశాన్ని మనం ఎంతవరకూ ఉపయోగించుకున్నామన్నది ఆలోచించుకోవడానికి ఈ నెల రోజులు ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భగవంతుడి ఆదేశాలను పాటిస్తారు. ఉపవాస నియమాలు ఎలా ఉంటాయంటే.. వేకువజామున 4 గంటల లోపు (సహర్) భోజనాది కార్యక్రమాలు పూర్తిచేయాలి. మళ్లీ సాయంత్రం 6.30 వరకు (ఇఫ్తార్) వరకు ఎటువంటి ఆహారం, నీరు తీసుకోకూడదు. లాలాజలం కూడా మింగకూడదు. రోజా సుమారు 14 గంటల వరకు ఈ ఉపవాస దీక్ష ఉంటుంది. సహర్ తో మొదలై ఇఫ్తార్‌తో రోజా ముగుస్తుంది. రోజాలకు సహర్, ఇఫ్తార్‌లు ప్రాణప్రదం. ముస్లింలు ఉపవాసం పాటించడానికి ముందు తెల్లవారుజామున భుజించడాన్ని సహర్ అంటారు. ఫజర్ నమాజ్‌కు ముందే లేచి తినడం వల్ల రోజంతా ఉత్సాహంగా గడపవచ్చు. దైవారాధనలు, ఖురాన్ పారాయణం చురుగ్గా చేసుకోవచ్చు. ఇదే సహర్‌లో ఉన్న శుభం. అల్లాహ్ అనుమతించిన వేళలో ఆహారం తీసుకోవడం ద్వారా.. ఉపవాసం పాటించాలన్న దైవాజ్ఞను నిర్వర్తించగలిగే శక్తి వస్తుంది. ఉపవాసం అంటే శరీరాన్ని కృశింపజేసుకోవడం కాదు. దైవంపై మనసు నిలపడం అని గ్రహించాలి. అందుకే సహర్ భుజించి సాయంత్రం వరకు దైవారాధనలో కాలం గడపాలి. బాలింతలకు, ప్రయాణంలో ఉన్నవారికి, రోగగ్రస్థులకు ఈ ఉపవాసం నుంచి మినహా యింపు ఉంటుంది. ఉపవాసం ఉన్న వ్యక్తి చెడుతలంపులకు దూరంగా ఉండాలి. అబద్ధాలు చెప్పకూడదు. ఘర్షణలకు దిగకూడదు. ఎవరైనా ఘర్షణకు దిగినా.. నేను ఉపవాసంలో ఉన్నానంటూ చెప్పుకుని తప్పుకోవాలి. ఇకపోతే ఖురాన్ ఘనమైన రాత్రిలో అవతరింపజేశారు. ఆ రాత్రి ఆత్మ, దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతిఆజ్ఞను తీసుకొని అవతరిస్తారు. ఆ రాత్రి తెల్లవార్లూ పూర్తిగా శాంతి, శ్రేయాలే అవతరిస్తుంటాయి. ప్రవక్త ముహమ్మద్‌కు వినిపించిన దైవవాణి ఇది. అది వినిపించిన రాత్రి మరేదో కాదు లైలతుల్ ఖద్ర్. అదృష్ట, దురదృష్టాల నిర్ణయాల అమలుకు అల్లాహ్ దైవదూతలకు ఫర్మానాలు అందజేసే రాత్రి ఇది. ఖద్ర్ అంటే శ్రేష్ఠమైన అని మరో అర్థం ఉంది. అందుకే దీనిని శ్రేష్ఠమైన రాత్రిగా కూడా అభివర్ణించారు. రంజాన్ నెలలో చివరి పది రోజులు ఆయన మసీదులోని నాలుగు గోడలకే పరిమితం అయ్యేవారు. పూర్తిగా దైవారాధనలో మునిగిపోయేవారు. ఇలా పది రోజులు మసీదులోనే గడపడాన్ని 'ఏతికాఫ్' అంటారు. లైలతుల్ ఖద్ర్‌లో పూర్ణ విశ్వాసంతో, దైవం ప్రసాదించే ప్రతిఫలాన్ని ఆశించి ఆరాధన చేసిన వారి గత అపరాధాలన్నిటినీ దైవం క్షమిస్తాడు అని ప్రవక్త ఉపదేశించారు. అందుకు అనుగుణంగా రంజాన్ చివరి పదిరోజులు ముస్లింలు ఏతికాఫ్ పాటిస్తారు. ఖురాన్ పారాయణం చేస్తారు.

# బెల్లంపల్లి కాల్ టెక్స్ ఏరియాలో భారీ చోరీ

- 14 తులాల బంగారం, కిలోన్నర వెండి ఎత్తుకెళ్లిన అగంతకులు
- ప్రభుత్వ ఉపాధ్యాయుని ఇంట్లో రూ లక్ష నగదు, 3 తులాల బంగారం ,4 బైకులు చోరీ





**బెల్లంపల్లి, మార్చి 29:** బెల్లంపల్లి పట్టణంలోని కాల్ టెక్స్ ఏరియాలో శనివారం తెల్లవారుజామున దొంగలు హడలెత్తించారు. కాల్ టెక్స్ ప్రాంతంలోని రెండిళ్లలో చొరబడి పెద్ద మొత్తంలో దొంగతనానికి పాల్పడ్డారు. ఇటీవలనే గృహప్రవేశం చేసిన సాన శ్రావణ్ తన ఇంట్లో నిద్రిస్తుండగా దొంగలు చొరబడ్డారు. ఇంట్లోని బీరువాని పగలగొట్టి అందులో నుండి 14 తులాల బంగారం, కిలోన్నర వెండిని ఎత్తుకెళ్లారు. అదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్ కు చెందిన ఇంట్లో చొరబడి రూ లక్ష నగదుతో పాటు 3 తులాల బంగారం దోచుకెళ్లారు. ఇదే ఘటనలో కాలనీలో ఇళ్ళ ముందు నిలిపి ఉంచిన 4 బైకులను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల నుండి విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఏసిపి ఏ.రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలొద్దీన్ లతోపాటు బెల్లంపల్లి టూ టౌన్, తాళ్లగురిజాల ,వన్ టౌన్ ఎస్సైలు కె.మహేందర్, చుంచు రమేష్, రాకేష్, ఏఎస్ఐ తిరుపతిలు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను వివరాలు అడిగి తెలుసుకు న్నారు. డాగ్ స్క్వాడ్ తో బాధితుల ఇళ్ళతో పాటు పరిసర ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దొంగలను గుర్తించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులను కోరారు. డాగ్ స్క్వాడ్ తో పాటు క్లూస్ టీం లతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. త్వరలోనే ఈ సంఘట నకు పాల్పడిన దొంగలను పట్టుకుంటామని ఏసిపి. ఏ.రవికుమార్ తెలిపారు.

# నేటి తరం విద్యార్థులు భారతీయ సంస్కృతులను తెలుసుకోవాలి

## శ్రీహర్ష కళాశాల చైర్మన్ పల్లె భూమేష్





**రామకృష్ణాపూర్, మార్చ్ 29:** నేటితరం విద్యార్థులు భారతీయ సంస్కృతులను తెలుసుకోవాలని మంచిర్యాల శ్రీహర్ష డిగ్రీ కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కళాశాల ఆవరణలో ట్రెడిషనల్ డే వేడుకలను కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా పల్లె భూమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణిస్తూ దేశ, రాష్ట్ర సాంప్రదాయాలను కూడా తెలుసుకో వాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఒక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ ముఖ్యమన్నారు. తమ కళాశాలలో చదుతున్న ప్రతి విద్యార్థి అన్ని రంగాలలో రాణించే విధంగా మెలుకువలు తెలిసిన అధ్యాపక బృందం ఉందని తెలియజేయడానికి గర్విస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరెల్లి అనిత, పోటు మనోహర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలతో జాగ్రత్త

## గుర్తింపు దుకాణాల నుంచే కొనాలి

## ధాన్యం సేకరణకు సజావుగా ఏర్పాట్లు

**నిజామాబాద్,మార్చి29:** విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు విధిగా బిల్లు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. రూ.5 లక్షల రైతు బీమా పథకంపై గ్రామాల్లో రైతులకు ఏఈఓలతో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ వానాకాలం సీజన్‌లో రైతులకు అందజేసేందుకు విత్తనాలు సిద్దంగా ఉన్నాయని తెలిపారు. వరి, జీలుగు, పెసర, కందులు తదితర విత్తనాలను ఆయా మండలకేంద్రాల్లోని సహకార సంఘాలు, గ్రోమోర్ కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేటుగా కొనుగోలు చేసేందుకు గానూ హైబ్రీడ్‌కు చెందిన పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇదిలావుంటే జిల్లాలోధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో... ప్రతిరోజూ పండగే...!

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి - రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 29**
తెలంగాణ ప్రజలకు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతిరోజూ పండగ రోజే అని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు శు భాకాంక్షలు తెలుపుతూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గడిచిన 15 నెలల కాలంలో ఇందిరమ్మ ప్రభుత్వం చేసిన పాలనపై తెలంగాణ ప్రజలందరూ సంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కావాల్సిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతుందని తెలిపారు. మహిళల కోసం ఆర్టీసీ ఉచిత బస్సు, రూ. 500కే గ్యాస్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు బంధుతో పాటు సన్నాలకు బోనస్ కల్పించిన ఘనత తమదేనన్నారు. ఇళ్లు లేని పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లను విడతల వారీగా మంజూరు చేస్తూ వస్తున్నామని దీనిపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తాజాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువకుల ఉపాధి కోసం రాజీవ్ యువవికాస్ పేరుతో రూ. 50వేల నుంచి రూ.4లక్షల రుణం ఇచ్చే పథకాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లోని సుమారు 5లక్షల మందికి పైగా యువతకు ఉ పాధి దొరుకుతుందని వెల్లడించారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న 'శ్రీ విశ్వావసు నామ' సంవత్సరంలోనూ ఇదే రకమైన పాలనను కొనసాగిస్తూ తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దరిచేరుస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## సీతారామ కళ్యాణం మహోత్సవం ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్



**తొలి సమయం మహబూబాబాద్ మర్చి 29:**
మహబూబాబాద్ ఎమ్మెల్యే వ సీతారామ కళ్యాణ వసంత నవరాత్రి మహోత్సవ ఆహ్వాన కరపత్రాలు తన క్యాంప్ కార్యాలయం లో ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ఆవిష్కరణ చేశారు ఈనెల 30 నుంచి నుంచి ఏప్రి ల్ 6 వ తారీకు వరకు జరిగే సీతారామ మహోత్సవ కార్యక్రమాల్లో మానుకోట ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పద్మం ప్రవీణ్ కుమార్ ఓం నారాయణ లోయ ఇంద్రసేనారెడ్డి మోహన్ రావు ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ సందర్భంగా రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ




**తొలి సమయం వరంగల్ మార్చ్ 29**
ఖిల్లా వరంగల్ ఈద్గాలో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ పండుగ తోఫా కిరాణం సమన్ కిట్లు ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ ఉబేద్ బాబా మరియు నగర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నంది రాం నాయక్ మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం పాల్గొని తవక్కల్ ట్రస్టు చైర్మన్ ఎంఏ జబ్బర్ గారిని అభినందిస్తూ అడ్వాన్సుగా రంజాన్ పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు, ఎం ఏ జబ్బార్ మాట్లాడుతూ తన సొంత ఖర్చుతో అందరికీ రేషన్ కిట్లు ఇస్తున్నట్లు తెలిపారు మరియు అందరికీ రంజాన్ పండుగ శు భాకాంక్షలు తెలిపారు, గత 16 సంవత్సరాలుగా రేషన్ కిట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజులలో ఇంకా బాగా ఇలాంటి ప్రోగ్రామ్ చేస్తానని తెలిపారు కమిటీ సభ్యులు అందరికీ సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ ఇంత మంచి ప్రోగ్రాం పెట్టిన జబ్బర్ గారిని అభినందిస్తూ మీరు ఇంకా ముందు ఇంకా చాలా మంచి ప్రోగ్రాములు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 41 డివిజన్ కార్పొరేటర్ శ్రీ పోశాల పద్మ స్వామి గౌడ్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చాంద్ పాషా మరియు కమిటీ సభ్యులు ఎండి మగ్దూం,మీర్జా హసన్ బేగ్, దస్తగీర్, గఫార్,ఇంతియాజ్ ఖాన్,సాదిక్,సలీం, సర్వర్ ,వహీద్, ఆజం ,సర్వర్, అఫ్జల్, ఫహీమ్, అహ్మద్,ఎండి అజమ్,ఎండి ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవకు తగిన గుర్తింపు

**టీబిఆర్ ఐకాన్ అవార్డ్ అందుకున్న కరణం కార్తీక్ రావు**




**తొలిసమయం, హైదరాబాద్ మార్చి 29 :**
మల్కాజిగిరిలో జరిగిన కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు టీబిఆర్ ఐకాన్ అవార్డ్ ను కరణం కార్తీక్ రావు కు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరం (సీనియర్ పోలీసు ఆఫీసర్ ఇన్ కమాండెంట్) కరణం కార్తీక్ రావు ను సన్మానించి శాలువా, మెమోంటో లతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్తీక్ రావు మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాలు చేసేందుకు ఈ అవార్డ్ మరింత బాధ్యత ను పెంచిందని అన్నారు. టీబీఆర్ సంస్థ వారికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ హెడ్ అశోక్ కుమార్, ఛైర్మెన్ చింతపట్ల వెంకటచారి, హాస్య నటుడు పృథ్వి, జబర్దస్త్ రాకింగ్ రాకేష్, కళాకారుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# దండకారణ్యంలో తూటాల మోత

**సుక్మా ఎన్కౌంటర్ లో 17 మంది మావోయిస్టులు మృతి**

**మృతిచెందిన వారిలో 11మంది మహిళలు**





**చర్ల, మార్చి 29** తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బస్తర్‌లోని సుక్మా జిల్లాలోని కొంటా సెక్షన్‌లోని ఉపంపల్లి వద్ద నక్సలైట్లు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 11 మంది మహిళా నక్సలైట్లు సహా మొత్తం 17 మంది నక్సలైట్లు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో రూ. 25 లక్షల రివార్డుతో ఉన్న నక్సలైట్ జగదీష్ అలియాస్ బుధ్రా కూడా మృతి చెందాడు.ఎన్‌కౌంటర్ స్థలం నుండి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సుక్మా జిల్లాలోని కేరళపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోగుండ, నేండుమ్, ఉపంపల్లి చుట్టుపక్కల ప్రాంతాలలో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఆధారంగా, 2025 మార్చి శుక్రవారం డి ఆర్ జి సుక్మా సి ఆర్ పీ ఎఫ్ ల సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కోసం బయలుదేరిందని పోలీసు సూపరింటెండెంట్ సుక్మా కిరణ్ చవాన్ తెలియజేశారు. ఈ ఆపరేషన్ సమయంలో, శనివారం ఉదయం 08 గంటల నుండి మావోయిస్టులు , భద్రతా దళాల మధ్య నిరంతర కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో సిఆర్‌పిఎఫ్ జవాన్ సహా నలుగురు జవాన్లు గాయపడ్డారు, కానీ వారు ప్రమాదం నుండి బయటపడ్డారు. నక్సలైట్లు, భద్రతా దళాల మధ్య జరిగిన కాల్పుల్లో 11 మంది మహిళా నక్సలైట్లు సహా మొత్తం 17 మంది నక్సలైట్లు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌కు నాయకత్వం వహిస్తున్న నక్సలైట్ దర్భా డివిజన్ కార్యదర్శి కుహ్రామి జగదీష్ అలియాస్ బుధ్రా కూడా ఎన్‌కౌంటర్‌లో మరణించారు. హత్యకు గురైన నక్సల్ జగదీష్ సుక్మా జిల్లాలో డజనుకు పైగా తీవ్రమైన కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన 7గురు నక్సలైట్ల లో దర్భా డివిజన్ కార్యదర్శి (స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు) కుహదామి జగదీష్ అలియాస్ బుధ్రాగా గుర్తించారు. ఇతను పమేడ్‌లోని పర్గుడెం పోలీస్ స్టేషన్ నివాసి. ఇతనికి రూ. రివార్డుతో పాటు రూ. 25 లక్షలు, దుర్గుడ పోలీస్ స్టేషన్ కేరళపాల్, కేరళపాల్ ఏరియా కమిటీ అధ్యక్షుడు, గగన్‌పల్లి పోలీస్ స్టేషన్ సాల్వం జోగి ఎర్రబోర్, డివిజన్ అధ్యక్షుడు) మాద్వి దేవే గడ్డడిపార పోలీస్ స్టేషన్ గదిరాస్, సెక్యూరిటీ దళం కమాండర్, కుట్రోమ్ పోలీస్ స్టేషన్ నివాసి దాసరి కోవాసి దర్భా, పార్టీ సభ్యుడు హూంగి నిలవాయ పోలీస్ స్టేషన్ అరన్‌పూర్, ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఇతర నక్సలైట్ల మృతదేహాలను గుర్తించే పని జరుగుతోంది.

## కాంగ్రెస్ పాలనలో ఆగని జర్నలిస్టుల అక్రమ అరెస్టులు

**పెద్ద వంగర నమస్తే తెలంగాణ రిపోర్టర్ కొండ సతీష్ అరెస్ట్**

**సబ్ జైల్లో ధైర్యం చెప్పిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**




**తొర్రూరు తొలి సమయం మార్చి 29**
పాలకుర్తి నియోజకవర్గం పెద్ద వంగర మండలం నమస్తే తెలంగాణ రిపోర్టర్ కొండ సతీష్ ను అక్రమంగా అరెస్టు చేసి మహబూబాబాద్ జిల్లా సబ్ జైలు లో పెట్టగా నేడు మూలకాత్ లో వారిని కలిసి ధైర్యం చెప్పిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గతంలో పెద్ద వంగర పోలీస్ స్టేషన్లో బయట వ్యక్తులతో కలిసి మందు పార్టీ చేసుకుంటున్న పోలీసుల గుట్టు రట్టు చేసినందుకే పగబట్టి, అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడుతున్నందుకే ఇలా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని ఇప్పటికైనా జర్నలిస్ట్ మిత్రులు, ప్రజలు ఏకం అయ్యి ఇలాంటి అక్రమ కేసులపై ఎదురు తిరగాలి అని అక్రమంగా అరెస్టు చేసిన పెద్దవంగర మండల నమస్తే తెలంగాణా రిపోటర్ సతీష్ ని వెంటనే విడుదల చేయాలనీ అక్రమ కేసులు ఎత్తి వేయాలని ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## స్వంత ఖర్చులతో కబరస్తాన్ శుభ్రం చేసుకున్న ముస్లింలు

**గ్రామాలలో కబరస్థాన్ లను పట్టించుకోవాలి -ప్రభుత్వం**



**తొలి సమయం తొర్రూరు మార్చి 29**
పెద్ద వంగర మండలం చిట్యాల గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా కంపచెట్లు నిలవడంతో ఎవరు స్పందించకపోవడంపై గ్రామంలో ఉన్న యువకులు ఖబరస్తాన్ లను పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేపించారు ప్రభుత్వాలు నిరుపేద మైనార్టీ ముస్లింలను పట్టించుకోవాలని వాపోయారు గత కొన్ని సంవత్సరాలుగా కాంపౌండ్ వాల్ లేకుండా చుట్టూ ఉన్న ప్రజలు మలమూత్ర విసర్జనలు చేస్తున్నారు కావున ప్రభుత్వం తరఫున వాటికి నిధులు కేటాయించి కాంపౌండ్ వాల్స్ మంజూరు చేయాలని ఈ రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు గత కొంతకాలంగా కబరా స్థానాలను పట్టించుకోకపోవడం వలన అక్రమాలకు గురవుతున్నాయని వాపోయారు ఇప్పటికైనా గవర్నమెంట్ చూసి వాటికి కనీసం కాంపౌండ్ వాల్పైన మంజూరు చేయాలని కోరుచున్నారు

**ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ దావత్‌లో పాల్గొన్న**

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి



**తొలి సమయం తొర్రూరు మార్చి 29**
తొర్రూరు పట్టణ కేంద్రంలోని మసీదులో ముస్లింలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డ, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రెడ్డి, ముస్లింలు మత పెద్దలు. పాల్గొన్నారు

## ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి..

**జిల్లా కాంగ్రెస్ నాయకులు పద్మం ప్రవీణ్**



**తొలి సమయం మహబూబాబాద్ మర్చి 29:**
మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ కు గిరిజన కోట లో అవకాశం కల్పించాలని, కాంగ్రెస్ జిల్లా నాయకులు పద్మం ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్ట కాలం లో కాంగ్రెస్ జెండా వీడ కుండా నిబద్దత తో కార్యకర్తలకు అండగా ఉన్నారని రాష్ట్రం లోనే అత్యధిక మెజారిటీ తో గెలిపొందిన మురళీ నాయక్ సౌమ్యుడు అన్నారు మంత్రి పదవి ఇస్తే ఈ ప్రాంత అభివృద్ధి, సంక్షేమానికి పాల్పడుతాడని అన్నారు.

## గులాబీ గూటికి చేరుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పార్టీ లోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.**



**తొలి సమయం రాయపర్తి మార్చి 29**

రాయపర్తి మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలోకాంగ్రెస్ పార్టీ కి చెందిన పలువురు...రేవంత్ ప్రజా దర్బార్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఆశ్రఫ్, మాజీ వార్డ్ నెంబర్ భర్త జలగం రవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ అఖిల్, కాస్రబోయిన కుమార్ (కరుణం), ఎండీ కామరోద్దీన్, పోగులకొండ ఎల్లయ్య, చందు పార్వతలు, కాస్రబోయిన కుమార్ (బోడ), జాంబూల ఐలయ్య, చెడుపాక శ్రీకాంత్, గారే అనిల్, గారే వెంకన్న, గారే రమేష్, గుగులోత్ చంద్రు, గుగులోత్ వెంకటేష్, తదితరులు ఈ రోజు బిఆర్ఎస్ పార్టీ లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించిన....బి రాష్ట్ర మాజీ మంత్రి పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమం లో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడవెల్లి లింగయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన బట్టు నాయక్

**తొలి సమయం దంతాలపల్లి మార్చ్ 29**



దంతాలపల్లి మండలం వేములపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త గుమ్మడి వెల్లి లింగయ్య అనారోగ్యంతో మరణించారు. దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏఎంసీ వైస్ చైర్మన్ బట్టు నాయక్ లింగయ్య భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించాడు, ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాడు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపేట సురేష్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుండ గాని సైదులు, సందు లింగన్న, ప్రవీణ్, సతీష్, రామ నర్సు, ఆదిరెడ్డి, ప్రశాంత్, లక్ష్మణ్, మురళి, భాస్కర్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగుడుకు బానిసై ఉరివేసుకొని ఆత్మహత్య

**తొలి సమయం తొర్రూరు మార్చి 29**



పెద్ద వంగర మండలం కొరిపల్లి గ్రామానికి చెందిన రంగు రమేష్ తండ్రి కొమురయ్య వయసు 35 కులం గౌడ్ వృత్తి కూలి పని చేసుకునేవారు గత కొంతకాలంగా మద్యం తాగుట కొలవాటు పడి ఈరోజు ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంకా మందు కావాలి అని భార్యతోనే డబ్బులు ఇయ్యమని అడగడంతో భార్య నిరాకరించడంతోనే భర్త ఇంటి ముందు ఉన్న రేకులకు తాడు తో ఉరివేసుకొని చనిపోయాడు నేను చూసి గట్టిగా అరిచేసరికి మా ఇంటి ముందు ఉన్న ఎర్ర సుజాత భర్త రవి వచ్చి చూడగానే భర్త చనిపోయి ఉన్నాడు కావున మాకు నా భర్త చనిపో వడం పట్ల ఏ లాంటి అనుమానం లేదు కావున నా భర్త శివముకు పంచనామా చేసి తిరిగి అప్ప చెప్పగలరని స్థానిక స్టేషన్ పెద్దవంగర ఎస్ ఐ ప్రకటనలో తెలిపారు.

## విచారణ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/భద్రాచలం మార్చి 29**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శనివారం స్పెషల్ సబ్ జైలు భద్రాచలంను సందర్శించారు. ఈ సందర్భంగ విచారణ ఖైదీలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ క్షణికావేశం లో చేసిన నేరాలతో ఖైదీలుగా మారి జైలు జీవితం గడపాల్సి వస్తుందని తద్వారా తమ విలువైన భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. విచారణ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. ఈ సందర్భంగ జైలులో ఉన్నటువంటి ఖైదీలకు విచారించి న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ఖైదులకు ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. జైలు పరిసరాలు, ఖైదీలకు వడ్డించే ఆహారం, సదుపాయాలు,ఆరోగ్య పరిస్థితిల గురించి విచారించారు. ఖైదీలలో మార్పుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు పాల్గొన్నారు.

# గోర్ బోలి (లంబాడి భాష)8వ షెడ్యూల్‌లో చేర్చేలా తెలంగాణ అసెంబ్లీ చారిత్రక నిర్ణయం

**సిఏం రేవంత్ రెడ్డి తో పాటు, లంబాడా హక్కుల ప్రతినిధులు వెడ్మ బొజ్జు పటేల్ డాక్టర్ బెల్లయ్యకు నాయక్, ఐఏఎస్ కొప్పుల రాజుకు పాలాభి షేకం**

**తొలి సమయం, హైదరాబాద్ మర్చి 29:**

లంబాడా భాషను రాజ్యాంగం లో ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చేందుకు తెలంగాణ అసెంబ్లీ లో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా మామడ మండలం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటుగా లంబాడ హక్కుల నాయకులు వెడ్మ బొజ్జు పటేల్ డాక్టర్ తేజ నాయక్ మరియు కొప్పుల రాజు ఐఏఎస్ లకు నిర్మల్ జిల్లా ఆదివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా గోవింద నాయక్ మాట్లాడుతూ.. మౌలికంగానే దేశంలో బడుగు బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ మనుగడలోనే పీడిత వర్గాలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం ఉంటుంది అన్నారు, గోర్ బంజారా భాషకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బలం చేకూరింది అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ది చారిత్రక నిర్ణయంగా జాతి గుర్తు పెట్టుకుంటుందని అన్నారు. లంబాడా బాషా పరిరక్షణలో మరొక కీలక ముందడుగు పడ్డదని సంతోషించారు. ఈ సందర్భం లంబాడా భాషాభిమానులకు గొప్ప గర్వకారణం గోర్ బాషా హక్కుల సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ముందడుగు ప్రశంసనీయం అన్నారు రాష్ట్రంలో 40 లక్షల మంది దేశంలో 15 కోట్ల మంది బంజారా నాయకులకు సంతోషంగా ఉన్నది. అన్నారు, జిల్లా ఇంచార్జ్ మంత్రి ధనసరి సీతక్క, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్




చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా మామడ మండల ఇన్చార్జ్ అనిల్ రఫీ మాజీ జెడ్పిటిసి లింగారెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ రాథోడ్ జైసి ఎంపీపీ రాథోడ్ సంతోష్ జెడ్పిటిసి బాపయ్య వకీల్ సాగర్ ప్రేమ్ దాస్ రసమల్ల అశోక్ ప్రవీణ్ రత్నం పాల్గొన్నారు.

# పశుపక్షుల దాహార్తి తిర్చేందుకు ముస్లింల స్ఫూర్తి

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/చుంచుపల్లి మార్చి 29**

జంతువుల పట్ల దయ చూపినందుకు అల్లా మనకు కూడా ప్రతిఫలం ఇస్తాడని భావించి దానిని ఆచరణాత్మకంగా చేసి చూపించిన ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ మాసంలో సేవాభావానికి స్ఫూర్తికి నిదర్శనం నిలిచారు. చుంచుపల్లి మండలం, రుద్రంపూర్ కు చెందిన ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలో అన్న పానీయాలు లేకుండా ఉండటం ఎంత కష్టమో, మన పరిస్థితి ఈ విధంగా ఉంటే పశుపక్షాల పరిస్థితి ఎంటని ముస్లిం యువకులు ఆలోచించారు.

మండుతున్న ఎండలు, భూగర్భజలాలలు అడుగంటడంతో వేసవి తాపాన్ని తట్టుకోవడం మానవులకే కష్టతరంగా మారిన సమయంలో పశు పక్షుల పరిస్థితి ఏమిటని ఆలోచించారు. వృధా అవుతున్న నీటిని వినియోగంలోకి తేవడమే కాకుండా పశుపక్షులకు ఉపయోగకరంగా మార్చేందుకు, రుద్రంపూర్ ఈద్గా వద్ద ఉన్న చేతి పంపు నుండి వచ్చే నీటిని తమ అవసరాలకు వాడుకోగా వృధాగా పోతున్న నీటిని నిల్వచేసేందుకు సిమెంట్ తొట్టిని అమర్చారు. దీంతో నిల్వ ఉన్న నీటిని పశుపక్షాదులు తాగేందుకు ఉపయోగపడనుంది. ప్రాణదారణమైన నీటిని వృధా కాకుండా వినియోగంలోకి తెచ్చి పశుపక్షాదుల దాహార్తిని తీర్చి మండుటెండల్లో




ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు వీరు చేసిన కృషిని స్థానికులు అభినందనలతో పాటు, మనస్సాక్షికి సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు, పవిత్ర రంజాన్ మాసంలో అవతరించిన ఖురాన్ చూపిన బాటలో పవిత్రమైన మనసుతో ఆలోచిస్తే ఇలాంటి కార్యక్రమాలు ఖురాన్ లో ఎన్నో తెలుపబడ్డాయని రంజాన్ మాస పవిత్రతను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షబ్బీర్, మహబూబ్ పాషా, షేక్ సోనీ సాహెబ్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

# మాగంటి కళాపీఠం ఆధ్వర్యంలో కవి గాయక సమ్మేళనం

**40 మంది కవులతో మనోరంజకంగా సాగిన కవి సమ్మేళనం**

**మాగంటి సూర్యం స్ఫూర్తితో కళలను కళాకారులను ప్రోత్సహిస్తున్నాం**

**లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల కో డైరెక్టర్ సాయి సూర్య**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/భద్రాచలం మార్చ్ 29**

శ్రీ విశ్వ వాసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు కలలు కళాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో శ్రీ మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించిన కవి గాయక సమ్మేళనం మనోరంజకంగా కొనసాగింది. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల కో డైరెక్టర్ మాగంటి సాయి సూర్య నేతృత్వంలో నిర్వహించిన ఈ కవి గాయక సమ్మేళన కార్యక్రమానికి సుమారు 40 మంది కవులు కళాకారులు హాజరై ఉగాది యొక్క ప్రత్యేకతను తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే కవితలను తెలుగు భాషా ప్రాముఖ్యతను తెలియపరిచే పద్యాలను పాడి అర్థాలను వివరించి తెలుగు భాష గొప్పతనాన్ని తెలుగు నామ సంవత్సర ప్రత్యేకతను ఉగాదికి ఉన్న విశిష్టతను తెలియపరిచారు. ఈ కార్యక్రమానికి పర్యావరణ ప్రేమికులు గొల్ల భూపతి రావు అధ్యక్షత వహించగా విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులు తిప్పన సిద్దులు ప్రముఖ కవిత్రి చిట్టి లలిత లు మాట్లాడుతూ మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడే విధంగా మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల వారు ఇటువంటి కవి సమ్మేళనాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా జీవితంలో ఉగాది రుచులదిరిగానే సంతోషాలు సుఖాలు, కష్టాలు, దుఃఖాలు, సమపాలనలో ఉంటాయని తెలియపరచటమే ఉగాది యొక్క ప్రత్యేకత అని అన్నారు. మాగంటి సూర్యం జీవించిన కాలంలో కళాకారులను కవులను అనేక సందర్భాలలో ప్రోత్సహిస్తూ సాహితీ స్రవంతి మాగంటి కళాపీఠం లతోపాటు భద్రాద్రి కళావేదికలను ప్రోత్సహిస్తూ మన సంస్కృతి సంప్రదాయాలను తెలిసే విధంగా ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన కవులు కళాకారులు వివిధ అంశాలపై తమ కవితలను పాటలను వినిపించగా హాజరైన కవులందరినీ మాగంటి కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పామరాజు తిరుమలరావు కవి ప్రసాద్ ఎర్రంశెట్టి పూర్ణిమ తదితర కవులు కళాకారులు పాల్గొన్నారు

**మాగంటి సూర్యం గారి స్ఫూర్తితో తెలుగు కళా రంగ అభివృద్ధికి కృషి చేస్తాం.....**

మాగంటి సాయి సూర్య కలల అన్న కళాకారులు అన్న మాగంటి సూర్యం కి అమితమైన ప్రేమ అనురాగాలు ఉండేవి కళాకారులను ప్రోత్సహించేందుకు లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆవరణలో అనేక కళా సమ్మేళనాలు ఇష్ట గోష్టులు కవితా చర్చ కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించేవారు. ఎంతోమంది ఏజెన్సీ ప్రాంత కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చి వారి ప్రతిభను ప్రపంచానికి తెలిసేలాగా మాగంటి సూర్యం కృషి చేశారు అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుండి కళాకారులను కవులను భద్రాచలం తీసుకువచ్చి వారి ప్రతిభను ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేయడంలో మాగంటి సూర్యం కృషి మరువలేనిది. మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో అనేక రకాల కళాసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తెలుగు భాష యొక్క ప్రాముఖ్యతను తెలుగు నామ సంవత్సరం యొక్క ప్రత్యేకతను ఉగాది వంటి తెలుగు సంవత్సరాది విశిష్టతను నేటితరం వారికి తెలిసేందుకు ఇటువంటి కవి సమ్మేళనాలు ఉపయోగపడతాయన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. సుమారు 40 మంది కవులు కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి ఉగాది యొక్క విశిష్టతను తెలియజేశారు భవిష్యత్తులో మాగంటి కళా పీఠం ఆధ్వర్యంలో మరిన్ని కళా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాము

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101